సాక్షి
శ్రీకాకుళం

సోమవారం, 6, అక్టోబర్, 2025



గుండెల్లో గుబులు

జిల్లా కేంద్రంలో మాస్టర్ ప్లాన్ కొందరి గుండెల్లో గుబులు రేపుతోంది. దీనిపై ఆందోళన వ్యక్తమవుతోంది.

- 8లో



అమ్మో.. మెమో

వైద్యారోగ్య శాఖలో గ్రూపుల గోల పెరుగుతోంది. వరుసగా మెమోలు జారీ అవుతున్నాయి.

- 8లో

10న మెగా జాబ్ మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 10న శ్రీకాకుళం అభ్యుదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేళాలో 18 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని వెయ్యికి పైగా ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నాయని తెలిపారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్నవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, సందేహాలుంటే 9704960160, 6301045132 నంబర్లను సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

జిల్లా అండర్-18 సెపక్‌తక్ర జట్ల ఎంపికలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్-18 బాలబాలికల సెపక్‌తక్ర జట్ల ఎంపికలు ఈనెల 7వ తేదీన జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ ఎంపికలు మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సెలక్షన్ ట్రయల్స్ జరుగుతాయని చెప్పారు. ఈ ఎంపికల్లో పాల్గొనే బాలబాలికలు 18 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను ఈనెల 11, 12 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాల వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సెపక్‌తక్ర చాంపియన్‌షిప్-2025 పోటీలకు పంపించనున్నట్టు ఎమ్మెస్సార్ వెల్లడించారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌ఫొటోలను తమ వెంట తీసుకురావాలని కోరారు. మరిన్ని వివరాలకు కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి (సెల్: 9949291288)ని సంప్రదించాలని సూచించారు.

వంశధార మెయిన్ కాలువ గట్టుకు గండి



వంశధార ఎడమ ప్రధాన కాలువకు సింగుపురం వద్ద ఏర్పడిన భారీ గండి

నందిగాం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని బెజ్జిపల్లి పంచాయతీ సింగుపురం సమీపంలో వంశధార ఎడమ ప్రధాన కాలువ 73వ కిలోమీటరు వద్ద భారీ గండి పడింది. దీంతో కాలువలోని నీరు కిందనున్న పంటపొలాలను ముంచేసింది. ఆదివారం వంశధార డీఈఈ శేఖర్‌రావు ఆధ్వర్యంలో గండిని పూడ్చే కార్యక్రమం చేపట్టారు. అయితే మదనగోపాలసాగరం నుంచి నీరు అధికంగా వస్తుండటంతో కాలువలోని నీటిని డైవర్ట్ చేయడానికి వీలు కావడం లేదు. వంశధార కాలువలు 51, 52, 53, 54లను తెరిచి నీటిని విడిచిపెట్టినప్పటికీ ఉధృతి ఆగలేదు. సోమవారం సాయంత్రానికి గండిని పూడ్చేలా చర్యలు తీసుకుంటామని డీఈఈ శేఖర రావు తెలిపారు.

'కార్మిక సమస్యలు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

సోంపేట: కార్మిక వర్గ సమస్యల పరిష్కారానికి పోరాడే సంస్థ సీఐటీయూ అని ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. సోంపేటలో సీఐటీయూ జిల్లా మహాసభల ముగింపు వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నుంచి గాంధీ మండపం వరకు ర్యాలీ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. సభలో నర్సింగరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మందసలో జీడి పరిశ్రమ యాజమాన్యాలు కార్మికులకు పని కల్పించకుండా కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయకుంటే ధర్నా చేస్తామన్నారు. సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గోవిందరావు మాట్లాడుతూ పనిగంటలు పెంచుతూ ఆమోదించిన చట్టాన్ని రద్దు చేయాలన్నారు.

నూతన జిల్లా కమిటీ..

సభలో భాగంగా నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సీహెచ్ అమ్మన్నాయుడు, ప్రధాన కార్యదర్శిగా పి.తేజేశ్వరరావు, కోశాధికారిగా అల్లు సత్యనారాయణను ఎన్నుకున్నారు.

ఆపద అంటే
ఆ..పద అంటూ

ఆపద అంటే ఆ..పద అంటూ యువత నిండు గుండెతో స్పందిస్తున్నారు. ఆపత్కాలంలో ఆపద్బాంధవుల్లా వ్యవహరిస్తున్నారు. నీరు, కన్నీరు కలిసి ప్రవహించిన వరదకు ఎదురొడ్డి నిలబడుతున్నారు. కష్టంలో తడిచిన బతుకులకు భుజాన్ని సాయంగా అందిస్తున్నారు. అధికారుల కోసమో, నాయకుల కోసమో ఎదురు చూడకుండా తాము స్వయంగా రంగంలోకి దిగి సేవ అనే పవిత్ర యాగాన్ని కొనసాగిస్తున్నారు.

- యువతలో పెరుగుతున్న సేవాభావం
- విపత్తుల వేళ స్వచ్ఛందంగా చేయూత
- వరద సమయాల్లో అత్యవసర సాయం
- అధికారుల కోసం ఎదురుచూడకుండా రంగంలోకి దిగుతున్న వైనం

టెక్కలి:

యువతలో సామాజిక దృక్పథం పెరుగుతోంది. సెల్‌ఫోన్ వదలడం లేదని, ఉత్తి పుణ్యానికే సహనం కోల్పోతున్నారని, వయసుకు తగ్గ పరిపక్వత ఉండడం లేదని యువకులపై వస్తున్న విమర్శలను తాజా వరద కడిగి పారేసింది. జిల్లాను ముంచెత్తిన వరదలకు యువత అడ్డుగా నిలబడ్డారు. కష్టాల్లో ఉన్న వారికి సాయం చేస్తూ స్ఫూర్తి రగిలించారు. అత్యవసర సమయాల్లో అధికార యంత్రాంగం కోసం ఎదురు చూడకుండా వారే సేవకులుగా మారుతున్నారు.

ఆదుకునే మనసు ఉండాలి



విపత్తులు, ప్రమాదాలు సంభవించే సమయాల్లో ప్రతి గ్రామంలో యువత సాయం చేయడానికి ముందుకు రావాలి. అధికారులు వస్తారని ఎదురుచూడకుండా తక్షణ సాయం చేయాలి. మా గ్రామంలో యువకులంతా అదే పని చేశాం. గ్రామానికి రాకపోకలు నిలిచిపోయే విధంగా వరద నీరు పోటెత్తిన సమయంలో ఓ వృద్ధుడికి అత్యవసరంగా వైద్య సేవలు అవసరమయ్యాయి. అంతా కలిసి అతడిని ఆస్పత్రికి తరలించాం.

– రెల్ల అప్పారావు, ఉయ్యాలపేట, నందిగాం మండలం.



నందిగాం మండలం ఉయ్యాలపేటలో వరద నీటి ప్రవాహం నుంచి వృద్ధుడిని ఆస్పత్రికి తరలిస్తున్న యువకులు (ఫైల్)

ఇటీవల తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలో వంశధార, మహేంద్రతనయ, నాగావళి, బాహుదా వంటి నదులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, గెడ్డలు, వాగులు పొంగి పొర్లి గ్రామాల్లోకి వరద నీరు చేరి భయానక పరిస్థితులు చోటు చేసుకున్నాయి. జిల్లాలో వివిధ చోట్ల వరదల్లో చిక్కుకున్న వారికి తమకు తోచిన విధంగా స్థానిక యువత సేవా కార్యక్రమాలను చేపట్టారు. నందిగాం మండలం ఉయ్యాలపేట గ్రామం వద్ద ఓ వృద్ధుడికి అత్యవసరంగా వైద్య సేవలు అవసరం కావడంతో స్థానిక యువత వరద నీటి నుంచి ఆ వృద్ధుడిని రక్షించింది. అలాగే జలుమూరు మండలం రామకృష్ణాపురం గ్రామంలో కూలిపోయిన ఇంటి నుంచి వృద్ధులను స్థానిక యువకులే కాపాడారు. జి.సిగడాం మండలం ధవళపేట వద్ద రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును అక్కడి వారే తొలగించారు. వజ్రపుకొత్తూరు మండలం శివరాంపురం గ్రామంలో వరద నీటి నుంచి తాడు సాయంతో గ్రామస్తులను తరలించారు. విపత్తుల సమయాల్లో అధికారుల కోసం ఎదురు చూడకుండా ప్రాణాలు ఫణంగా పెట్టి సాయం అందజేస్తూ పలువురు ప్రశంసలు పొందుతున్నారు.

సొంత నిధులు వెచ్చించి..



కూలిన చెట్టును తొలగిస్తున్న దవళపేట గ్రామ సర్పంచ్ వడిశ మహేశ్వరరావు

జి.సిగడాం: తుఫాన్ వర్షాలకు శ్రీకాకుళం–రాజాం ప్రధాన రహదారిలో సంతవురిటి గ్రామ సమీపంలో భారీ వృక్షం రోడ్డుపై పడిపోవడంతో సుమారుగా 2 గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ధవళపేట సర్పంచ్ వడిశ మహేశ్వరరావు సొంత నిధులతో యంత్రాలను ఏర్పాటు చేసి చెట్టును తొలగించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వై.మధుసూదనరావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. మహేశ్వరరావును ఎస్‌ఐతోపాటు సంతవురిటి సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాంద్రంగి వెంకటేష్ అభినందించారు.

ప్రయాణికుల కష్టాలు చూశాను..



వానలో ప్రయాణికుల కష్టాలు కళ్లారా చూశాను. చిన్నపిల్లలు, వృద్ధులను దృష్టిలో ఉంచుకుని నా సొంత నిధులతో యంత్రాలను తెప్పించి చెట్టును తొలగించాం. నాకు ఇలాంటి సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

– వడిశ మహేశ్వరరావు, సర్పంచ్, దవళపేట, జి.సిగడాం

ఐదు గంటల శ్రమ

వజ్రపుకొత్తూరు: చినుకులు సూదుల్లా గుచ్చుతున్నా, వాన దంచి కొడుతున్నా శివరాంపురం యువత చలించలేదు. విజయదశమి రోజు కురిసిన కుండపోత వర్షానికి ఊరికి బయట ప్రపంచానికి సంబంధాలు తెగిపోయాయి. దీంతో గ్రామానికి చెందిన ఇప్పిలి తిరుపతి, రమేష్, ఎరకారావు, లక్ష్మణరావు, దట్టి వాసుదేవరావుతో పాటు సుమారు 20 మంది వరకు యువకులు ఆ వరద నీటిలో ఐదు గంటల పాటు తాడు పట్టుకుని నిత్యావసరాలు తెచ్చుకునేలా, అవసరమైన వారు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. తమ గ్రామానికి పూండి గ్లోబ్ రహదారి నుంచి పక్కా రహదారి నిర్మించాలని ఎంతమందిని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు.



తాడుతో సహాయం చేస్తున్న శివరాపురం యువత

ఎవరూ ఆదుకోలేదు

మా గ్రామానిది దుర్భర పరిస్థితి. ఎప్పుడు వరద వచ్చినా బెండి గెడ్డ ఉప్పుటేరు వల్ల గ్రామం మునుగుతుంది. గ్రామం చుట్టూ రొయ్యల చెరువులు నిర్మించడంతో వరద గ్రామంపై పడింది. దీంతో దీంతో 20 మంది యువకులం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తాడుతో వరదలో చిక్కుకున్న జనాలను తరలించాం. వరద నీటిలో వృద్ధులు నడవలేక అవస్థలు పడ్డారు. ఒక రైతే కొట్టుకుపోయేవారే. చిన్నారులు, గర్భిణులు చాలా బాధపడ్డారు. – **ఇప్పిలి తిరుపతి, యువకుడు, శివరాంపురం, వజ్రపుకొత్తూరు**

శ్రమించి చెట్టును తొలగించాం



తుఫాన్ ధాటికి మా గ్రామ ప్రధాన రోడ్డుపై పెద్ద చింత చెట్టు కూలిపోయింది. చెట్టు కొమ్మలు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాయి. దీంతో గ్రామం చీకటిగా మారిపోయింది. ఊరికి రాకపోకలు నిలిచిపోయాయి. ఊరివారమంతా శ్రమించి చెట్టును తొలగించాం. – **దుంపల వేణుగోపాల్, యువకుడు, సీతాపురం, వజ్రపుకొత్తూరు**

కాళ్లు కనిపించాయి





మా గ్రామంలో ఇల్లు కూలిపోయిందని తెలిసింది. వెంటనే అక్కడకు వెళ్లాం. ఇద్దరు వృద్ధులు మట్టిలో పడి ఉన్నారు. అందులో బుద్దయ్య కాళ్లు కనిపించాయి. వెంటనే వెళ్లి వారికి బయటకు తీశాం. అప్పటికి వారు ఊపిరితోనే ఉన్నారు. ఏమీ కాదనే అనుకున్నాం. కానీ ఆస్పత్రికి వెళ్లాక ఇద్దరూ చనిపోవడం బాధాకరం. – **సవర కృష్ణారావు, సవర ముకుందరావు, సవరటబ్బూరు, మందస మండలం**

క్రీడాకారులకు ఉపకారం

- ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్‌లు
- అక్టోబర్ 21లోగా దరఖాస్తులకు అవకాశం
- ఎంపికైతే నెలకు రూ.15వేలు నుంచి రూ.30వేల వరకు ఉపకార వేతనం
- ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుల స్వీకరణ



వాలీబాల్ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిభ కలిగిన నిరుపేద క్రీడాకారులకు బాసటగా నిలవాలని ఓఎన్‌జీసీ సంస్థ మరోసారి నిర్ణయించింది. ఓఎన్‌జీసీ క్రీడా స్కాలర్‌షిప్ పథకం కింద 2025–26 సంవత్సరానికి గాను వెనుకబడిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు స్కాలర్‌షిప్‌లను అందజేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను తాజాగా విడుదల చేశారు. ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్‌ను 21 క్రీడాంశాల్లో సబ్‌–జూనియర్స్, జూనియర్స్ బాలబాలికలకు, సీనియర్స్ పురుషులు, మహిళా క్రీడాకారులకు వర్తింపజేయనున్నారు. ఎంపికైనవారికి నెలకు రూ.15,000 నుంచి రూ.30,000 వరకు క్రీడాస్కాలర్‌షిప్‌లను అందజేయనున్నారు. దేశవ్యాప్తంగా ప్రావీణ్యత, అర్హత కలిగిన 250 మంది ప్లేయర్స్‌ను ఈ స్కాలర్‌షిప్‌లను అందించనున్నారన్నారు.

ఎవరు అర్హులంటే..

ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసేందుకు 15 నుంచి 20 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బాలబాలికలు అర్హులు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలి. నిర్దేశించిన 21 క్రీడాంశాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెంది, ప్రతిభావంతులైన క్రీడాకారులు అర్హులు. ఆసక్తి గల క్రీడాకారులు ఓఎన్జీసీ వెబ్‌సైట్ స్పోర్ట్స్‌స్కాలర్‌షిప్.ఓఎన్‌జీసీ.కో.ఇన్‌లో అక్టోబర్ 21వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

గొప్ప అవకాశం



ప్రతిభ కలిగిన నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువ క్రీడాకారులకు ఇదొక అద్భుతమైన అవకాశం. ఈ నెల 21వ తేదీ వరకు అవకాశం ఉంది. జిల్లాలో ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నారు. ఓఎన్‌జీసీ వెబ్‌పోర్టల్‌లో స్కాలర్‌షిప్ పథకం వివరాలతో పాటు నియమ నిబంధనలు, షరతులను గ్రహించి వెంటనే దరఖాస్తు చేసుకోవాలి.

– డాక్టర్ కె.శ్రీధర్‌రావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

నేడే స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదివారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులు వచ్చినట్లు చెప్పారు. స్వచ్ఛ అవార్డులు జిల్లా స్థాయిలో 14 కేటగిరీల్లో 46 అవార్డులు వచ్చాయన్నారు. అవార్డుల ప్రధానోత్సవం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు జరుగుతుందన్నారు.



విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విస్తృత స్థాయి సన్నద్ధత



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు కుంభా రవిబాబు, పిరియా విజయ, చింతాడ రవికుమార్, పేరాడ తిలక్, పిరియా సాయిరాజ్, కేవీజీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, గొర్లె కిరణ్‌కుమార్

వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర విస్తృత స్థాయి సమావేశం విశాఖ జిల్లా ఆనందపురంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి జిల్లా నుంచి నాయకులంతా హాజరయ్యారు. – విశాఖపట్నం

క్లుప్తంగా

రూ.లక్ష పలికిన లడ్డూ


లడ్డూతో భక్తులు

వజ్రపుకొత్తూరు: కొండవూరులో వేద సరస్వతీ దేవి 28వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసి ఉత్సవాల్లో అమ్మవారి లడ్డూ పాట రూ.100500 పలికింది. శనివారం రాత్రి నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన కోనారి రాజశేఖర్ లడ్డూను కైవసం చేసుకున్నారు. దేవీ వస్త్రాన్ని రూ.17001లకు లండ నరేష్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీ-10 భారత్ జట్టుకు ఈశ్వర్‌రెడ్డి ఎంపిక


ఈశ్వర్‌రెడ్డి

టెక్కలి రూరల్: అంతర్జాతీయ స్థాయి సెకండ్ ఏషియన్ టీ-10 ఇండియా క్రికెట్ జట్టుకు కోటబొమ్మాళి గ్రామానికి చెందిన మూగి ఈశ్వర్‌రెడ్డి ఎంపికై నట్లు అసోషియేషన్ ప్రతినిధులు సుకుమార్, రాంబాబు ఆదివారం తెలిపారు. థాయిలాండ్‌లో పోటీలు జరుగుతాయని, సుమారు రూ.లక్షా 50వేలు ఖర్చు అవుతుందని ఈశ్వర్‌రెడ్డి చెప్పారు. తనది పేద కుటుంబమని, దాతలు సహకరించాలని, వివరాలకు 9493740222 సంప్రదించాలని కోరారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


త్రినాథ్ మృతదేహం

ఇచ్ఛాపురం రూరల్: రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం వారిది. పొట్ట కూటి కోసం ఇతర ప్రాంతానికి వెళ్లి పనిచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. తేలుకుంచి గ్రామానికి చెందిన మేరుగు త్రినాథ్(55) ఇతర ప్రాంతాల్లో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య వరలక్ష్మీ, పెళ్లీడుకొచ్చిన కుమార్తె శారద ఉంది. ఆదివారం విశాఖపట్నంలో కూలి పనుల కోసం బయల్దేరిన త్రినాథ్ ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో బెర్హంపూర్-విశాఖ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కిన సమయంలో ప్రమాదవశాత్తు ఫ్లాట్‌ఫాం మధ్య పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో సీహెచ్‌సీకి తరలించగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రమణమూర్తి

శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో ఆదివారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కార్యాచరణలో భాగస్వామ్యం వహించే ఉద్యోగులను పాలకులు చిన్నచూపు చూడటం తగదన్నారు. డీఏలు సకాలంలో విడుదల చేయాలని, పెండింగ్ బకాయిలను చెల్లించాలని, పీఆర్‌సీ అమలయ్యే వరకు ఐఆర్ ప్రకటించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో కేంద్ర ప్రభుత్వం ఆ ఉద్యోగులకు ఇటీవలే డీఏ ప్రకటించిందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రెండేళ్లుగా డీఏలు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిలపై ప్రభుత్వం రోడ్డు మ్యాప్ ప్రకటించాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57 అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రంలో ఉన్న 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో కలిసి ఐక్య ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ నాయకులు పి.ప్రభాకరరావు, ఎం.సన్యాసిరావు, పి.రామకృష్ణ, రాజేశ్వర రావు, జి.శ్రీనివాసరావు, జి.తిరుమలరావు, సీహెచ్ జగన్, రామచంద్రరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కంచిలి: సూదిపుట్టుగ గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం రాత్రి దాడిచేశారు. గ్రామానికి చెందిన ప్రేమ్ దొళాయి అనే వ్యక్తికి చెందిన ఇంటి టెర్రస్‌పై రేకుల గదిలో కోతముక్కల పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు సిబ్బందితో వెళ్లారు. ప్రేమ్ దొళాయితో పాటు మరో 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.92,960 నగదు, 13 మొబైల్ ఫోన్లు, 3 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మాస్టర్ ప్లాన్‌తో.. గుండెల్లో గుబులు!


- 2017లో తయారుచేసిన శ్రీకాకుళం మాస్టర్ ప్లాన్‌కు తాజాగా ఆమోదం
- 150 అడుగుల రింగ్ రోడ్డుతో పలు ఆస్తులకు ముప్పు
- 2047 వరకు నిర్మాణాలు, అమ్మకాలు జరపలేని పరిస్థితి!


జిల్లా గ్రీవెన్స్‌లో అధికారులకు అందిస్తున్న బాధితులు

శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలో మాస్టర్ ప్లాన్ కలకలం రేగింది. పెదపాడు నుంచి అరసవల్లి, కాజీపేట, 80 అడుగుల రోడ్డు, పొన్నాడ వంతెన మీదుగా నవభారత్ జంక్షన్ వరకు 150 అడుగుల రోడ్డుకు 2017లో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. కొన్ని కొన్ని సవరణలు చేస్తూ 2020లో ప్రభుత్వానికి నివేదించారు. అటు తర్వాత ఈ మాస్టర్ ప్లాన్ పెండింగ్‌లో ఉండిపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ ప్లాన్‌కు ఆమోదిస్తూ 2020 నుంచి 2047 వరకు ఈ ప్లాన్ లో పొందుపరిచిన రోడ్డు పరిధిలో ఉన్న స్థలాల్లో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఉండవని, ఆ పరిధిలో ఉన్న స్థలాలను రోడ్డు కోసం సేకరిస్తామని చెబుతూ ఉత్తర్వులు వెలువడించడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఇదే విషయమై చర్చ జరుగుతోంది.

- వాస్తవానికి ఇటువంటి మాస్టర్ ప్లాన్ ఆమోదించే ముందు సాధ్యసాధ్యాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఇవేమీ లేకుండానే కూటమి ప్రభుత్వం ఆమోదించేసింది. ఇప్పుడు ఈ ప్లాన్ అమలు చేయాలంటే 2023లో నిర్మాణానికి అనుమతించిన 80 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి పాక్షికంగా, ఆ పక్కనే నిర్మితమైన అపార్ట్‌మెంట్‌లో సగానికి పైభాగం కూల్చేయాల్సి ఉంటుంది. ఇదే ప్రాంతంలోని ఓ లేఔట్‌లో మూడు అపార్ట్‌మెంట్లు సైతం కూల్చాల్సిన పరిస్థితి. ఇక్కడే ఉన్న పెద్దమ్మతల్లి, రామ మందిరం కూడా దెబ్బతినే అవకాశాలు ఉంటాయి.


తాజాగా ఆమోదించిన మాస్టర్ ప్లాన్ నమూనా

- పెదపాడు నుంచి పొన్నాడ వంతెన వద్ద వచ్చే వరకు పలు భవనాలను కూడా ప్రభుత్వం సేకరించి రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన పరిధిలో ఉన్న స్థలాల్లో 2047 వరకు నిర్మాణాలు చేసే పరిస్థితి ఉండదు. అటువంటి అప్పుడు నగరపాలక సంస్థ అధికారులు లేఅవుట్లకు, అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ రోడ్డు పరిధిలో ఉన్న స్థలాల యజమానులు, ఇళ్లు ఉన్న యజమానులు, ఇంటి నిర్మాణం చేపట్టాలని అనుకుంటున్నారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇదే విషయమై వారం రోజులుగా కలెక్టర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. వారంతా రాష్ట్రస్థాయికి నివేదిస్తామంటున్నారు తప్ప కచ్చితమైన హామీలు ఇవ్వడం లేదని పలువురు వాపోతున్నారు. దీనిపై న్యాయపోరాటం చేసినా న్యాయం జరుగుతుందో లేదోనన్న అపనమ్మకంతో వారంతా ఉంటున్నారు. విశాఖపట్నం వంటి మహానగరంలోనే 150 అడుగుల రోడ్లు లేవని, శ్రీకాకుళం వంటి నగరానికి అవసరమా అని వారందరూ ప్రశ్నిస్తున్నారు.

2047 వరకు అనుమతుల్లేవ్..

మాస్టర్ ప్లాన్ ఎప్పుడు రూపొందించినా ప్రజాభిప్రాయ సేకరణ తరువాతే ఆమోదించారు. ఇది వెంటనే అమలైపోయే అంశం కాదు. అయితే మాస్టర్ ప్లాన్‌లోని రోడ్ల పరిధిలో ఉంటే ఆయా స్థలాల్లో నిర్మాణాలకు 2047 వరకు అనుమతులు ఇవ్వరు.

– ప్రసాదరావు, కమిషనర్, నగరపాలక సంస్థ

- ప్రసాద్ ఓ ప్రభుత్వ ఉద్యోగి. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులోని ఓ ఆస్పత్రి వెనుకన ఉన్న లేఔట్‌లో స్థలం కొని 2017లో ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. దీనికి మున్సిపల్ అనుమతులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఇంటి విలువ మార్కెట్లో రూ.రెండున్నర కోట్లు ఉంటుంది. ప్రస్తుతం ఈ ఇల్లు కొత్తగా ప్రభుత్వం ఆమోదించిన మాస్టర్ ప్లాన్‌లోని 150 అడుగుల రోడ్డు పరిధిలో ఉండడంతో దీనిని విక్రయించాలనుకున్న రిజిస్ట్రేషన్ జరగదని తెలుసుకొని భార్యాభర్తలిద్దరూ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.
- గిరిబాబు అనే వ్యక్తి ఇదే లేఔట్‌లో ఇటీవలే స్థలం కొనుగోలు చేశారు. ఇందులో నిర్మాణం చేపట్టేందుకు నగరపాలక సంస్థలో ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 15న ప్లాన్ అప్రూవల్‌లో భాగంగా వేకెంట్ ల్యాండ్ టాక్స్ కట్టారు. అటు తర్వాత ప్లాన్ అనుమతులను పొందేందుకు నగరపాలక సంస్థ కార్యాలయానికి వెళ్లగా ఆ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వబోమని చెప్పేశారు. ఇదేంటని అడిగితే కొత్త మాస్టర్ ప్లాన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ఆగస్టు 6 నుంచి ఈ ప్లాన్ అమల్లోకి వచ్చిందని చెప్పారు. ఈ ప్లాన్‌లో 150 అడుగుల రోడ్డు పొందుపరిచారని, దాని పరిధిలోనికి వచ్చే మీ స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వబోమని నగరపాలక సంస్థ అధికారులు తేల్చిచెప్పారు. అటువంటి అప్పుడు సెప్టెంబర్ 15న వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ ఎలా కట్టించుకున్నారని ప్రశ్నించగా జవాబు చెప్పే వారే కరువయ్యారు.
- నగరానికి చెందిన శ్యామ్ అనే వ్యాపారి.. ఇదే ప్రాంతంలో ఓ పార్టీ ఆఫీసుకు సమీపంలో ఉన్న లేఔట్‌లో వారి కుటుంబ సభ్యులతో కలిసి ఐదు ప్లాట్లు కొనుగోలు చేశారు. రేటు ఎక్కువ అయినప్పటికీ నగరపాలక సంస్థల అనుమతులు ఉన్న లేఅవుట్ కావడంతో కొనుగోలు చేసి నిర్మాణానికి సన్నద్ధమవుతున్న తరుణంలో వారి గుండెల్లో రాయిపడేలా మాస్టర్ ప్లాన్ ఆమోదం విషయం తెలిసింది. ఈ మాస్టర్ ప్లాన్‌లో పొందుపరిచిన 150 అడుగుల రోడ్డు పరిధిలో వీరి కుటుంబ సభ్యులు కొనుగోలు చేసిన ఏడు ప్లాట్లు పోయే అవకాశముంది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేయాలి


సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో నిర్వాహకులు

శ్రీకాకుళం: చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం శ్రీకాకుళంలోని యూటీఎఫ్ భవన్‌లో గొంటి గిరిధర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, తార్కిక హేతుబద్ధ ఆలోచనలు, సృజనలను ప్రోత్సహించే జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్సు సంబరాలను విజయవంతం చేయాలని కోరారు.

అనంతరం జిల్లా హెడ్మాస్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్నాగుల వాసుదేవరావు, ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.సాయి శ్రీనివాస శర్మ, ఏపీ జీవశాస్త్ర ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, ఏపీ మ్యాథ్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కందుల అశోక్, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పైల రవి కుమార్, మండల విద్యాశాఖ అధికారి సంఘ నాయకులు కె.ఎ.రాములు, డాక్టర్ వైష్ణవిలను సన్మానించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.కూర్మారావు, జిల్లా నాయకులు హనుమంతు మన్మధరావు, ఆర్.సురేష్‌బాబు, పి.వేదవతి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ పాండూరు అప్పారావు, జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎస్.స్వర్ణకుమారి, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పి.జగదీశ్వర రావు, సీహెచ్ రాజు, ఆర్.స్వప్న, ఎస్.సులోచన రాణి, కె.తుషార కన్య, సీహెచ్ సుబ్బలక్ష్మి, జి.కృష్ణ వేణి, యూ.గిరిబాబు, పి.సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

వార్డు ప్లానింగ్ సెక్రటరీల కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా వార్డు ప్లానింగ్ సెక్రటరీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రవికిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు.

నూతన కార్యవర్గం: అధ్యక్షుడిగా రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా మోహన్, కోశాధికారిగా నారాయణరావు, ఉపాధ్యక్షులుగా నవీన్, ప్రశాంత్, సంయుక్త కార్యదర్శులుగా సూర్యతేజ, జయంత్, మహిళా అధ్యక్షురాలిగా పార్వతి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సర్లాన ప్రదీప్, షారూక్, చైతన్య, చంటి, ప్రత్యేక సలహాదారులుగా కవిటి హర్ష, సంపతిరావు మల్లేశ్వరరావు, సూరు దినేష్‌లను ఎన్నుకున్నారు.

వరల్డ్ బ్యాడ్మింటన్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా మోహన్‌సాయినాథ్


మోహన్‌సాయినాథ్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు టెక్నికల్ అఫీషియల్ (లైన్ జడ్జి)గా ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం గ్రామానికి చెందిన సంపతిరావు మోహన్‌సాయినాథ్ నియామకమయ్యారు. ఈ పోటీలు అసోంలోని గౌహతి వేదికగా ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ సంజయ్ మిశ్రా నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈయన అంతర్జాతీయ క్వాలిఫైడ్ రిఫరీ, శ్రీకాకుళం జిల్లా బాడ్మింటన్ సీఈఓ సంపతిరావు సూరిబాబు కుమారుడు. తండ్రీకొడుకులు ఇద్దరూ జూనియర్ వరల్డ్ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్లగా నియామకం కావడం విశేషం.

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీ దారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

అమ్మో.. మెమో!

- జిల్లా వైద్యారోగ్య శాఖలో గ్రూపుల గోల
- వరుస మెమోలు జారీ చేస్తున్న ఓ అధికారి
- ఇప్పటికే ఏడుగురు ఉద్యోగులకు 20కి పైగా మెమోలు జారీ



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

అరసవల్లి : వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఇప్పుడు కొత్తగా వర్గపోరు ఎక్కువైంది. మాట్లాడితే మెమో అన్న చందంగా 'పరిపాలన' సాగుతోంది. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీలక స్థానాల్లో ఉన్న రెండు సీట్ల మధ్య అంతర్గత పోరు.. పలు రకాల వివాదాలకు కేంద్రమవుతోంది. ఇక అవినీతి విషయంలో ఏకంగా డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ ఏసీబీకి చిక్కగా.. అక్రమాల్లో కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్ విధుల నుంచి సస్పెండయ్యారు. ఇలా ఈ కార్యాలయంలోని కీలక స్థానాలకు పెద్ద ఎత్తున అవినీతి మరకలంటాయి. రెండు మూడు నెలలుగా సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్‌కు, కార్యాలయ పరిపాలనాధికారి బాబూరావు మధ్య అభిప్రాయ భేదాలు ఎక్కువయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు ఇరు కీలక ఉద్యోగులకు సన్నిహితుల మధ్య వర్గ పోరు నడుస్తోంది. సూపరింటెండెంట్ సస్పెన్షన్ తర్వాత ఆయన వర్గానికి చెందిన పలువురు ఉద్యోగులకు మెమోల రూపంలో చర్యలు వెంటాడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుట్రలో భాగంగానే క్రమశిక్షణ చర్యలకు దిగుతున్నారని ఆరోపణలు జోరందుకున్నాయి.

రెండు నెలల్లో 20 మెమోలు...!

జిల్లా వైద్యారోగ్య శాఖలో మెమోల జారీ ఎక్కువయ్యింది. ఇటీవల ఏఎన్ఎంల (సచివాలయం) బదిలీల్లో బాగా జేబులు నింపుకొన్న ఓ అధికారి అంతా తానై వ్యవహరించడంతో పాటు అడ్డొచ్చినా.. అడ్డు చెప్పినా క్రమశిక్షణ చర్యలే అంటూ వ్యవహారం నడుపుతున్నారనే చర్చ జోరందుకుంది. రెండు మూడు నెలల్లోనే జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సబార్డినేట్, టైపిస్టు నుంచి సీనియర్ అసిస్టెంట్ హోదా వరకు సుమారు 45 మంది వరకు విధుల్లో ఉన్నారు. వీరంతా పరిపాలనా విభాగ సూచనల మేరకు మాత్రమే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అయితే ఇటీవల కొంత కాలంగా సాగుతున్న వర్గ పోరులో భాగంగా సుమారు ఏడుగురు ఉద్యోగులకు చర్యల్లో భాగంగా 20 వరకు మెమోలు జారీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ భవాని ప్రసాద్‌కు మూడు, సీనియర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కుమార్‌కు మూడు, సీనియర్ అసిస్టెంట్ చంద్రమౌళీశ్వరరావుకు రెండు, టైపిస్టు ఎస్.రామచంద్రరావుకు రెండు, టైపిస్టు ఎం.జగదీష్‌కు నాలుగు, సీనియర్ అసిస్టెంట్ విజయ సుందరీమణి (గీతాంజలి)కి మూడు, జూనియర్ అసిస్టెంట్ బి.రామచంద్రరావుకు రెండు చొప్పున మెమోలు వరుసగా జారీ చేశారు. వరుసగా మూడు మెమోలు జారీ చేస్తే చార్జి మెమో ఫ్రేమ్ చేసే అవకాశాలున్నాయి. సీసీఏ నిబంధనల ప్రకారం సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు ఇంక్రిమెంట్లు కూడా కోల్పోయే ప్రమాదముందని బాధిత ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఈ వరుస వ్యవహారాలతో డీఎంహెచ్‌వో కార్యాలయంలో మెమోల గోలపై చర్చ జిల్లా వ్యాప్తమైంది. అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని మెమోలను ఇచ్చారో.. లేక వర్గ పోరులో బలిపశువులను చేస్తున్నారో అన్న చర్చ కూడా సాగుతోంది. ఉన్నతాధికారులు జిల్లా కార్యాలయంలో 'పరిపాలన'పై ప్రత్యేక దృష్టి సారిస్తే మరిన్ని వాస్తవాలు బహిర్గతమవుతాయని ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

ఇలా కట్టారు..అలా కూలింది..

- కాలువ పనుల్లో బయటపడిన డొల్లతనం
- కానరాని అధికారుల పర్యవేక్షణ


టెక్కలి మండా పాలెం కాలనీ వద్ద కూలిన కాలువ గోడ

టెక్కలి: కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వెరసి పది కాలాల పాటు ఉండాల్సిన నిర్మాణాలు రోజుల వ్యవధిలోనే కూలిపోతున్నాయి. టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో మండపాలెం కాలనీ వద్ద పాత జాతీయ రహదారికి ఆనుకుని చేపడుతున్న మురుగు నీటి కాలువ నిర్మాణంలో నాణ్యత లేని పనుల డొల్లతనం బయటపడింది. సుమారు రూ.1.98 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఈ కాలువ నిర్మాణం చేపడుతున్నారు. ఓవైపు పనులు చేస్తుండగానే మరో వైపు కాలువ గోడలు కూలిపోతున్నాయి. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో కాలువ నిర్మాణాలు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొంత మంది కార్యకర్తలు ఈ పనులు చేస్తుండడంతో అధికారులు తమకేమీ పట్టనట్లుగా కనీసం పర్యవేక్షణ చేయడం మానేశారు. దీంతో కాలువ పనులు మున్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎయిర్‌పోర్టు సదస్సు బహిష్కరణ

- హాజరు కాని ఉద్దానం రైతులు
- సహకరించాలని ఎమ్మెల్యే వేడుకోలు


మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

పలాస: పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు, మందస మండలాల ఉద్దానం ప్రాంతంలో తలపెట్టిన కార్గో ఎయిర్‌పోర్టును ఉద్దానం ప్రజలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, సంబంధిత రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో పలాస రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం ఎయిర్‌పోర్టు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అవగాహన అంటూ ఏర్పాటు చేసిన ఈ సదస్సును ఉద్దాన ప్రాంత రైతులు బహిష్కరించారు. ముందు రోజే గ్రామ సచివాలయాలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను రప్పించి ఎయిర్‌పోర్టుకు అనుకూలంగా మాట్లాడించుకున్నారు. ఎయిర్ పోర్టు చాలా అవసరం అంటూ, ఉద్దానం అభివృద్ధి చెందాలంటే తాము భూములు ఇవ్వడానికి సిద్ధమేనని, అయితే ప్రజల్లో, రైతుల్లో నష్ట పరిహారం విషయమై సందేహాలు ఉన్నాయంటూ చెప్పుకొచ్చారు. ఎకరా భూమికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని, ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా మాట్లాడుతూ ప్రజా సంఘాల నాయకులు రకరకాల రంగుల జెండాలతో ఎక్కడి నుంచో వచ్చి రెచ్చగొడుతున్నారని, పర్యావరణ కాలుష్యం అంటున్నారని, అసలు ఎయిర్‌పోర్టు వద్దంటున్నారని, వారికి అభివృద్ధి అంటే అక్కర్లేదని, వారి ఇళ్ల ముందు మురుగు కాలువలను శుభ్రం చేయరని పరుష పదజాలంతో మాట్లాడారు. ప్రజలను చేతులెత్తి వేడుకుంటున్నానని, ఎయిర్‌పోర్టుకు సహకరించాలని కోరారు.

ఎయిర్ పోర్టుతో మేలే..

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ కార్గో ఎయిర్‌పోర్టు వల్ల ఉద్దానం ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఉద్దానం రూపురేఖలు మారుతాయన్నారు. చాలా మందికి అపోహలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయడానికే ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులు అభిప్రాయాలు తెలుసుకోకుండా ఒక్క అడుగూ ముందుకు పడదని, రేపటి నుంచి గ్రామాల్లోకి అధికారులు వస్తారని వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏ.పి.స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ జి.వెంకటేశ్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పలాస, మందస, వజ్రపుకొత్తూరు తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్‌గేమ్స్ పోటీలు


రెజ్లింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న సంఘ ప్రతినిధులు, పీడీలు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: మలివిడత స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీల ప్రక్రియ మొదలైంది. జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు వివిధ క్రీడాంశాల్లో ఎంపికలు చేపట్టారు. ఐదురోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో తొలిరోజు 12 క్రీడాంశాల్లో ఎంపికలు జరిగాయి. హాకీ ఎంపికలు శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో, వెయిట్‌లిఫ్టింగ్- పెద్దపాడులో, రెజ్లింగ్- పెద్దపాడులో, ఆర్చరీ- రాజ్‌కుమార్ అకాడమీ శ్రీకాకుళంలో, రగ్బీ, నెట్‌బాల్, రోప్‌స్కిప్పింగ్, షూటింగ్‌బాల్ ఎంపికలు- టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో, టేబుల్‌టెన్నిస్- శాంతినగర్‌కాలనీలో డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం, యోగా- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సత్యవరం, నరసన్నపేట మండలం, లాన్‌టెన్నిస్- శ్రీకాకుళం ఆర్ట్స్‌కాలేజ్ టెన్నిస్ అకాడమీలో, కరాటే ఎంపికలు శ్రీకాకుళం మహాలక్ష్మినగర్‌కాలనీలోని శ్రీచైతన్య స్కూల్ వేదికగా ఎంపికలను పూర్తిచేశారు. త్వరలో తుది జట్ల జాబితాను ప్రకటిస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, కె.మాధవరావు పర్యవేక్షించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సలహాదారు పి.సుందరరావు, ఆయా క్రీడాంశాల సెలక్టర్లు, పీడీ, పీఈటీలు ఎంపికలను నిర్వహించారు.

యోగా క్రీడాకారుల ఎంపికలు

నరసన్నపేట: స్కూల్ గేమ్స్‌లో సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో యోగా పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ సలహాదారు కె.రాజారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికల్లో సత్యవరం స్కూల్ నుంచి బి.జస్వంత్, బి.రాజ్యాణి, ఆర్. రమేష్‌లు ఎంపికయ్యారని ఎంఈఓ శాంతారావు తెలిపారు. పీఈటీలు జ్యోతీ రాణి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా జట్లు ఎంపికలను ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. అండర్ -14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు నెట్‌బాల్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్, షూటింగ్ బాల్ తదితర విభాగాల్లో జిల్లా జట్లు ఎంపికలు నిర్వహించారు. 95 పాఠశాలల నుంచి 650 మంది విద్యార్థులు హాజరయ్యారు. టెక్కలి డివిజన్ ఇన్‌చార్జి బి.నారాయణరావు, పీడీలు కె.కె.రామిరెడ్డి, ఎస్.లక్ష్మణరావు, ఎస్.కృష్ణారావు, ఎస్.నాగరాజు, పి.వెంకటరమణ, డి.లక్ష్మినారాయణ, అలివేణి, నర్మద పర్యవేక్షించారు.

7న పోరుబాట


సమావేశంలో పాల్గొన్న పలు సంఘాల నేతలు

శ్రీకాకుళం: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించనున్న పోరుబాట ధర్నా విజయవంతం చేయాలని పలు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఎన్జీవో హోంలో ఫ్యాప్టో చైర్మన్ బమ్మిడి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బోధన, బోధనేతర, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాలు ప్రతి ఒక్కరిని చైతన్యపరిచి విజయవాడలో జరిగే ధర్నాకు తరలివచ్చేలా చొరవ తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పడి 14 నెలలు కావస్తున్నా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని చెప్పారు. సమావేశంలో ఫ్యాప్టో కార్యదర్శి ప్రతాప్, ఏపీటీఎఫ్ నాయకుడు వెంకటేశ్వర్లు, నాయకులు గరుగుబిల్లి రమణ, శీర రమేష్‌బాబు, రామ్మోహన్ పాల్గొన్నారు.